మీ సేవ కేంద్రాలు తనిఖీ

మీ సేవ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఈఎండీ రవి

ఎదులాపురం, జూన్ 8 : మీ సేవ వీఎల్ ఈలకి సాంక్షన్ అలాట్ చేసిన స్థలంలోనే కేంద్రాలు నడిపించాలని ఈడీఎం రవి అన్నారు. శనివారం పట్టణంలోని తాంసి బస్టాండ్, కలెక్టరేట్‌లోని మీ సేవ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేషనరీ రిజిస్టర్ కచ్చితంగా అప్‌డేట్‌గా ఉంచాలన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మీ సేవ ఆపరేటర్ ఇచ్చేటటువంటి రసీదుపైన టీఎస్టీఎస్‌కి బదులుగా టీజీటీఎస్ స్టాంపు చేసుకొని రసీదు ఇవ్వాలన్నారు. మీ సేవ అందిస్తున్న ఆపరేటర్లు సర్వీసులు ఇవ్వకుండా జీరో ట్రాన్సక్షన్ అయి ఉంటే వాటిపైన రాష్ట్ర ఈఎన్డీ ఆఫీస్ ఆదేశాల మేరకు తగిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

10న సర్టిఫికేషన్ వెరిఫికేషన్

ఎదులాపురం, జూన్ 8 : ఆదిలాబాద్ జిల్లాలోని ప్రభుత్వ, మండల, జిల్లా పరిషత్ పాఠశాలలో పని చేస్తున్న భాషా పండితులు తెలుగు, హిందీ, మరాఠి, ఉర్దూ, వ్యాయమ ఉపాధ్యాయులకు ఈ నెల 10వ తేదీన జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి హాజరుకావాలని డీఈవో ప్రణీత తెలిపారు. సంబంధిత ఉపాధ్యాయులు సర్టిఫికేషన్ వెరిఫికేషన్‌కు హాజరవుతున్న వారు విద్యార్హత సర్టిఫికెట్లతో పాటు సర్వీసు రిజిస్టర్, ఒక జత జిరాక్స్ కాపీలతో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు హాజరుకావాలని పేర్కొన్నారు.

స్కూల్ అసిస్టెంట్‌గా ఉన్నతీకరణపై హర్షం

ఎదులాపురం, జూన్ 8 : ఆదిలాబాద్ జిల్లాలోని తెలుగు, హిందీ పండిత్, పీఈటీ పోస్టులను స్కూల్ అసిస్టెంట్‌గా ఉన్నతీకరణ చేయడంపై పీఆర్టీయూ జిల్లా పక్షాన హర్షం వ్యక్తం చేస్తున్నట్లు జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు ఆడే నూర్‌సింగ్, నర్ర నవీన్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. 25 సంవత్సరాల పాటు ప్రమోషన్‌కు నోచుకోకుండా కోర్డు కేసుతో నిలిచిపోయినా పోస్టులను ప్రభుత్వం చొరవతో ఉన్నతీకరించడం విషయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ప్రభుత్వానికి ఒప్పించి మార్గదర్శకాలు విడుదల చేయించిన పీఆర్టీయూ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు హర్ష వర్ధన్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

ఉపాధిలో అతివలే ముందు..

- పురుషుల కంటే పనికి హాజరవుతున్న మహిళ కూలీలు అధికం
- కుటుంబ పోషణకు అండగా నిలుస్తున్న మహిళలు

దిలావర్‌పూర్: న్యూలోలంలోని చెరువులో పనులు చేస్తున్న ఉపాధి హామీ మహిళ కూలీలు

దిలావర్‌పూర్, జూన్ 8 : విద్య, ఉద్యోగం, వ్యాపారం, రాజకీయాలతో పాటు ఏ రంగంలోనైనా పురుషులతో సమానంగా రాణిస్తున్న మహిళలు తాము ఉపాధి హామీ పనుల్లోనూ వారి కంటే ముందు నిలుస్తున్నారు. వలసలను నివారించేందుకు తీసుకువచ్చిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిర్వహించే పలు అభివృద్ధి పనుల్లో అతివలు ఉత్సాహంగా పాల్గొంటూ కుటుంబ పోషణకు తమవంతు ఆసరా నిలుస్తున్నారు. గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ పనులు అంతగా లేకపోవడంతో మహిళలు ఉదయం పూట ఉపాధి హామీ పనులకు వెళ్లి కుటుంబ పోషణకు చేదోడు వాదోడుగా నిలుస్తున్నారు. గృహిణులుగా కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తూ, ఉపాధి హామీ కూలీ పనుల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలుస్తున్నారు. నిర్మల్ జిల్లాలో అత్యధికంగా పురుషుల కంటే మహిళలు ఎక్కువగా ఉపాధి హామీ పథకంలో కూలీలుగా పని చేస్తున్నారు. దిలావర్‌పూర్ మండలంలోని 12 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పనులకు 4451 మంది కుటుంబాలు పనులకు వెళ్లుచుండగా అందులో నుంచి 7,129 మంది కూలీలు పనులు చేస్తున్నారు.100 రోజులు పని పూర్తి చేసిన కుటుంబాలు 445 ఉన్నారు. మొత్తం 7129 మంది కూలీలు పని చేయగా అందులో నుంచి మహిళ కూలీలు 4305, పురుషులు 2824 మంది నిత్యం కూలీ పనులకు వెళ్తున్నారు.

దిలావర్‌పూర్ మండలంలోని 12 గ్రామ పంచాయతీల్లో నుంచి అత్యధికంగా ఉపాధి హామీ పనులకు వెళ్తున్న గ్రామం న్యూ లోలంను గుర్తించారు. ఈ గ్రామంలో నుంచే పురుషుల కంటే ఎక్కువగా మహిళ కూలీలు ఉదయం నుంచి పనికి వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్నారు.

కుటుంబ పోషణకు తోడ్పాటు

ఉపాధి కూలీ పనులు చేయడంతో వచ్చే కూలీ భత్యం కుటుంబ పోషణకు చేదోడువాదోడుగా ఉంటుంది. అంతే కాకుండా కొంతమేరకు పొదుపు చేస్తున్నాను. చేసిన పనికి తగిన కూలీ రావడంతో మహిళలం దరం కలిసి ఉత్సాహంగా పనులు చేసుకుంటున్నాం.

-గోవిందుల లావణ్య, ఉపాధి కూలీ, లోలం

ఆసరాగా నిలుస్తోంది

అందరం కలిసి పని చేస్తే అలసట అనిపించదు. వేసవిలో వేరే ఏ ఇతర పనులు దొరకవు. ఉపాధి పనుల్లో పాల్గొనడంతో వచ్చిన కూలీ పైసలు ఆసరగా నిలుస్తుంది. తమకు డబ్బులు త్వరితగతిన చెల్లించి మెరుగైన సౌకర్యాలు కల్పించాలి.

-నంద గంగవ్వ, దిలావర్‌పూర్

మహిళలు సద్వినియోగం చేసుకుంటున్నారు

ఉపాధి పనులను అధిక సంఖ్యలో మహిళలు సద్వియోగం చేసుకుంటున్నారు. మండలంలో పనులు ముమ్మురంగా సాగుతున్నాయి. పురుషులతో సమానంగా కూలీ పనులకు మహిళలు అధికంగా వస్తున్నారు. అన్ని గ్రామాల కంటే లోలం గ్రామంలోని ఎక్కువ మంది మహిళలు ఉపాధి పనులను వినియోగించుకుంటున్నారు. -దివ్యరెడ్డి ఏపీవో దిలావర్‌పూర్



తాంసి: కరంజి(బీ)లో ఎండలో కరుస్తున్న వర్షం

మండుటెండలో వర్షం

ఆదిలాబాద్ ఫొటోగ్రాఫర్, జూన్ 8: ఆదిలాబాద్ జిల్లాలోలో శనివారం ఓ మోస్తరు వర్షం కురిసింది. మండుటెండలో వర్షం కురవడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. వేడితో సమతమవుతున్న ప్రజలు వాతావరణం చల్లబడడంతో ఉపశమనం పొందారు.

తాంసి(భీంపూర్), జూన్ 8 :

భీంపూర్ మండలం కరంజి(టీ), గుబిడి, గొల్లగడ్ గ్రామాల్లో శనివారం సాయంత్రం చిరుజల్లులు కురిశాయి. ఇప్పటికే విత్తనాలు పెట్టిన రైతులు హర్షం వ్యక్తం చేశారు. మిగతా రైతులు చేన్లతో విత్తనాలు వేసేందుకు సిద్ధమవుతున్నారు.

రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

మూడు రోజులు రైల్వేగేట్ బంద్

ఎదులాపురం, జూన్ 8 : పట్టణంలోని తాంసి బస్టాండ్ సమీపంలోని రైల్వే గేట్‌ను మూసివేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ నెల 10 వ తేదీ సాయంత్రం 6 నుంచి 12వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు తాంసి రైల్వే గేటును మూసి వేస్తున్నట్లు ప్రకటించింది. ట్రాక్ మరమ్మతుల నేపథ్యంలో గేటును మూసివేయాల్సి వచ్చిందని పేర్కొంది. అంతరాయానికి పట్టణ వాసులు సహకరించి, ప్రత్యామ్నాయ దారుల్లో వెళ్లాలని కోరింది.

కూలర్‌లో నీళ్లు నింపుతు.. విద్యుత్ షాక్‌తో ఒకరి మృతి

ఎదులాపురం, జూన్ 8 : కూలర్‌లో నీళ్లు నింపుతు వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని దుర్గనగర్‌కు చెందిన బొజ్జ నర్సింహులు(37) ఇంట్లోని కూలర్‌లో నీళ్లు నింపుతుండగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. వెంటనే రిమ్స్‌కు తరలించగా అప్పటికి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య బొజ్జ జ్యోతి మావల పోలీసుకు శనివారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మావల ఎస్ఐ వంగ విష్ణువర్ధన్ తెలిపారు.

సారంగాపూర్ ఎస్ఐగా శ్రీకాంత్

సారంగాపూర్, జూన్ 8: సారంగాపూర్ ఎస్ఐగా శ్రీకాంత్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్ఐగా పని చేసిన చంద్రమోహన్ నిర్మల్‌టౌన్ బదిలీపై వెళ్లారు. లక్ష్మణచాంద ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న శ్రీకాంత్ సారంగాపూర్‌కు బదిలీపై వచ్చారు. ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన శ్రీకాంత్‌కు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

కోర్టు ప్రాంతంలో చోరీకి యత్నం.. రిక్షా స్వాధీనం

ఎదులాపురం, జూన్ 8 : ఆదిలాబాద్ జిల్లా కోర్డు ప్రాంతంలో చోరీకి యత్నించిన సంఘటనలో సైకిల్‌రిక్షాను స్వాధీనం చేసుకున్నట్లు టూటౌన్ సీఐ అశోక్ తెలిపారు. శనివారం ఉదయం ఇద్దరు వ్యక్తులు కోర్టు ప్రాం తంలో చొరబడివిద్యుత్ మోటర్, రెండు పైపులను చోరీ చేసి వాటిని రిక్షాలో తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో అక్కడే ఉన్న జిల్లా కోర్డు అటెండర్ శ్రీనివాస్‌కు చప్పుడు రావడంతో అక్కడికి వెళ్లి చూడగా ఇద్దరు వ్యక్తులు సైకిల్ రిక్షాను వదిలి పారిపోయారు. అటెండర్ శ్రీనివాస్ టూ టౌన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ మదన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రూ.2,080 తగ్గిన తులం ధర

హైదరాబాద్‌లో రూ.71,670

దిగొచ్చిన బంగారం

హైదరాబాద్, జూన్ 8: బంగారం కొండ దిగుతున్నది. గత మూడు రోజులుగా పెరుగుతూ వచ్చిన పుత్తడి భారీగా దిగొచ్చింది. అంతర్జాతీయ మార్కెట్లో అనూహ్యంగా అతి విలువైన లోహాలు ధరలు ఒక్కసారిగా తగ్గడంతో దేశీయంగా ధరలు చౌకతున్నాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ తులం పుత్తడి ధర రూ.2,080 తగ్గి రూ.71,670కి దిగొచ్చింది. అంతకుముందు ఇది రూ.73,750గా ఉన్నది. అలాగే 22 క్యారెట్ బంగారం ధర రూ.1,900 తగ్గి రూ.67,600 నుంచి రూ.65,700గా నమోదైంది. అగ్రరాజ్యం అమెరికాలో నిరుద్యోగ గణాంకాలు తగ్గుముఖం పట్టడం, ద్రవ్యోల్బణ గణాంకాలు పుంజుకోవడంతో బంగారం ధరలు తగ్గడానికి ప్రధాన కారణమని బులియన్ వర్తకులు వెల్లడిస్తున్నారు. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు నిలిచిపోవడంతో కిలో వెండి ఏకంగా రూ.4,500 తగ్గింది. దీంతో కిలో వెండి రూ.1,00,500 నుంచి రూ.96 వేలకు దిగొచ్చింది. అలాగే న్యూఢిల్లీలో తులం బంగారం రూ.2,080 దిగి రూ.71,820కి తగ్గింది. పసిడితోపాటు వెండి ధరలు కూడా భారీగా తగ్గాయి. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర శుక్రవారం ఒకేరోజు 79.70 డాలర్లు తగ్గి 2,311.20 డాలర్లకు పడిపోయింది. అలాగే వెండి 2 డాలర్లు తగ్గి 29.27 డాలర్లుగా నమోదైంది.

హోండా కార్లపై ప్రత్యేక ఆఫర్లు

రూ.88 వేల వరకు రాయితీ ఇస్తున్న సంస్థ

న్యూఢిల్లీ, జూన్ 8: ప్రముఖ కార్ల తయారీ సంస్థ హోండా కూడా కొనుగోలుదారులను ఆకట్టుకోవడానికి ప్రత్యేక ఆఫర్లను తెరపైకి తీసుకొచ్చింది. ఈ నెలలో నూతన వాహనాన్ని కొనుగోలు చేయాలనుకునేవారికి బంపర్ ఆఫర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. 'హోండా సమ్మర్ బొనాంజా' పేరుతో ప్రకటించిన ఈ ఆఫర్ కింద రూ.88 వేల వరకు రాయితీ ఇస్తున్నది. ఈ ఎక్స్‌క్లూజివ్ ఆఫర్‌లో ఒక జంట ప్యారిస్ లేదా రూ.75 వేల నగదును గెలుచుకునే అవకాశం కూడా సంస్థ కల్పించింది. ఈ నెల చివరి వరకు హోండా ఎలివేట్, హోండా సిటీ, సిటీ-ఈ: హెచ్‌ఈవీ, హోండా అమేజ్‌లను కొనుగోలు చేసిన వారికి మాత్రమే ఈ ఆఫర్ వర్తించనున్నదని పేర్కొంది. వీటిలో హోండా అమేజ్‌పై రూ.76 వేల ప్రయోజనాలు అందిస్తున్న సంస్థ.. సిటీపై రూ.88 వేలు, సిటీ ఈ:హెచ్ ఈవీపై రూ.65 వేల వరకు, ఎలివేట్‌పై రూ.55 వేలు డిస్కౌంట్‌ను కల్పిస్తున్నది. ఈ సందర్భంగా కంపెనీ వైస్ ప్రెసిడెంట్ కునాల్ బెహ్ల్ మాట్లాడుతూ..కంపెనీ కార్లను కొనుగోలు చేసేవారికి ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలనే ఉద్దేశంతో ఈ సమ్మర్ బొనాంజా ఆఫర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు.

అదానీ చేతికి కోల్‌కతా పోర్ట్

ఓడరేవులపై పెరుగుతున్న గ్రూపు ఆధిపత్యం
దేశ తీర ప్రాంతం దాదాపుగా హస్తగతం



న్యూఢిల్లీ, జూన్ 8: అదానీ గ్రూప్ గుప్పిట్లోకి దేశంలోని మరో పోర్టు వచ్చింది. అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనామిక్ జోన్ (ఏపీ సెజ్) లిమిటెడ్.. కోల్‌కతాలోని శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ పోర్టు కంటైనర్ ఫెసిలిటీ కార్యకలాపాలు, నిర్వహణ కోసం ఐదేండ్ల కాంట్రాక్టును కుదుర్చుకున్నది. కాంపిటీటివ్ బిడ్డింగ్ ప్రక్రియ ద్వారా ఈ డీల్‌ను పొందినట్టు ఏపీసెజ్ ఓ ప్రకటనలో వెల్లడించింది. కాగా, ఇప్పటికే దేశంలోని 13 పోర్టులు, టెర్మినల్స్ అదానీ గ్రూప్ ఆధ్వర్యంలో పనిచేస్తున్నవే కావడం గమనార్హం. వీటిలో 45 బెర్తులున్నాయి. ముంద్రాలోగల దేశీయ తొలి పోర్ట్ ఆధారిత సెజ్, తిరువనంతపురంలోగల తొలి డీప్ వాటర్ ట్రాన్స్‌షిప్‌మెంట్ పోర్ట్ కూడా అదానీ సొంతమే.

ఏడు నెలల్లోగా..

లెటర్ ఆఫ్ యాక్సెప్టెన్స్ (ఎల్‌వోఏ) తేదీ నుంచి ఏడు నెలల్లోగా కోల్‌కతా కంటైనర్ ఫెసిలిటీలో కార్గో హ్యాండ్లింగ్ ఎక్విప్‌మెంట్‌ను అదానీ పోర్ట్స్ సంస్థ అందుబాటులోకి తేవాల్సి ఉన్నది. ఇక తమ నిర్వహణలో నేతాజీ సుభాష్ డాక్ వద్ద టెర్మినల్‌కు, కంటైనర్ పోర్ట్‌కు మధ్య కనెక్టివిటీ మెరుగవుతుందన్న ధీమాను ఏపీసెజ్ వ్యక్తం చేస్తున్నది. ముఖ్యంగా ఈ ఏడాది విజింజమ్, కొలంబోల్లో ట్రాన్స్‌షిప్‌మెంట్ హబ్‌ల ఏర్పాటే లక్ష్యంగా ముందుకు కదులుతున్నట్టు చెప్పున్నది. 'దేశవ్యాప్తంగా ఆయా పోర్టులు, లాజిస్టిక్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధిలో మాకున్న చిత్తశుద్ధి, అంకితభావం వల్లే నేతాజీ సుభాష్ డాక్ కాంట్రాక్టును కూడా దక్కించుకోగలిగాం' అని ఏపీసెజ్ సీఈవో అశ్వినీ గుప్తా అన్నారు. దేశ, విదేశాల్లోని వివిధ కంటైనర్ టెర్మినల్స్ నిర్వహణలో తమ సంస్థకున్న రెండు దశాబ్దాలకుపైగా అనుభవం పశ్చిమ బెంగాల్ ప్రజలకు, కస్టమర్లకు ప్రయోజనకరంగా మారుతున్నదని కూడా చెప్పారు.

తూర్పు తీరంలో..

భారత తూర్పు తీరంలో కోల్‌కతాలోని నేతాజీ సుభాష్ డాక్.. అతిపెద్ద కంటైనర్ టెర్మినల్‌గా ఉన్నది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో ఇక్కడ దాదాపు 0.63 మిలియన్ టీఈయూ (20 అడుగులకు సమానమైన యూనిట్) హ్యాండ్లింగ్ జరిగింది. పశ్చిమ బెంగాల్‌తోపాటు బీహార్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, అస్సాం, ఇతర ఈశాన్య రాష్ట్రాలతో పాటు నేపాల్, భూటాన్‌లకు సేవలు అందాయి. ఈ డాక్‌కు సింగపూర్, పోర్ట్ కెలాంగ్, కొలంబో పోర్ట్ హబ్‌ల నుంచి రెగ్యులర్ లైన్ సర్వీస్ కాల్స్ కూడా ఉన్నాయి.

మోదీ హయాంలోనే..

మోదీ హయాంలోనే అదానీ గ్రూప్ అన్ని రంగాల్లో వేగంగా విస్తరించుకుంటూ పోయింది. ముఖ్యంగా దేశంలోని దాదాపు అన్ని ఓడరేవులు, కీలక విమానాశ్రయాలు ఇప్పుడు గౌతమ్ అదానీ కనుసన్నల్లోనే ఉన్నాయంటే ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. వడ్డించేవాడు మనవాడైనప్పుడు బంతిలో ఏ మూలన కూర్చున్నా విందు భోజనమే. దీనికి తగ్గట్టుగానే గత పదేండ్లుగా కేంద్రంలో బీజేపీ సర్కారు అధికారంలో ఉన్న నేపథ్యంలో బిడ్డింగ్‌లో పాల్గొంటే చాలు ఆ కాంట్రాక్టు అదానీదే అన్నట్టు తయారవుతున్నది పరిస్థితి. గుజరాత్ (4), ఆంధ్రప్రదేశ్ (2), తమిళనాడు (2), గోవా (1), మహారాష్ట్ర (1), కేరళ (1), పుదుచ్చేరి (1), ఒడిషా (1)లో అదానీకి పోర్టులున్నాయి. ఇప్పుడు పశ్చిమ బెంగాల్ సైతం ఈ లిస్టులో చేరింది. శ్రీలంక, ఆస్ట్రేలియా, ఇజ్రాయెల్‌లోనూ ఉన్నాయి.

వాణిజ్య

ఎల్‌జీ 64 ఇంచుల ఓఎల్ఈడీ టెలివిజన్

ధర రూ.1.80 లక్షలు

హైదరాబాద్, జూన్ 8: దేశీయ మార్కెట్లోకి సరికొత్త టీవీను అందుబాటులోకి తీసుకొచ్చింది ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా. నూతన టెక్నాలజీ కోరుకుంటున్న వారిని దృష్టిలో పెట్టుకొని 64 అంగుళాల ఓఎల్ఈడీ సీ4 కృత్రిమ మేధస్సు టీవీను హైదరాబాద్‌లో విడుదల చేసింది. ఈ టీవీ ప్రారంభ ధర రూ.1,79,999గా నిర్ణయించింది.

నేషనల్ మార్ట్ మరో ఔట్‌లెట్

హైదరాబాద్, జూన్ 8: రిటైల్ ఔట్‌లెట్ సంస్థ నేషనల్ మార్ట్.. హైదరాబాద్‌లో మరో అవుట్‌లెట్‌ను ఏర్పాటుచేసింది. సంస్థకు ఇది ఏడో ఔట్‌లెట్ కావడం విశేషం. మెహదీపట్నంలో ఏర్పాటు చేసిన ఈ స్టోర్‌ను ఏఐఎంఐఎం ప్రెసిడెంట్ అసదుద్దిన్ ఓవైసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా కంపెనీ ఫౌండర్ యశ్ అగర్వాల్ మాట్లాడుతూ..అతి తక్కువ ధరకే నాణ్యమైన అన్ని రకాల ఉత్పత్తులను అందించడం వల్లనే కస్టమర్లను ఆకట్టుకోగలుగుతుంది.

పెట్టుబడులకు డెల్టా ఎయిర్‌లైన్స్ సుముఖం

కంపెనీ ప్రతినిధులతో రాష్ట్ర బృందం సమావేశం

హైదరాబాద్, జూన్ 8(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి అమెరికాకు చెందిన ప్రముఖ విమానయాన సంస్థ డెల్టా ఎయిర్‌లైన్స్ సుముఖత వ్యక్తం చేసినట్లు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. తెలంగాణకు పెట్టుబడులు రాబట్టడమే లక్ష్యంగా శ్రీధర్ బాబు నేతృత్వంలో రాష్ట్ర బృందం అమెరికాలో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా శనివారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి అట్లాంటాలోని డెల్టా ఎయిర్‌లైన్స్ ప్రధాన కార్యాలయంలో కంపెనీ వైస్ ప్రెసిడెంట్, సీటీవో నారాయణన్ కృష్ణకుమార్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు.

నేరుగా అట్లాంటాకు విమాన సేవలు...

హైదరాబాద్ నుంచి నేరుగా అట్లాంటాకు విమాన సర్వీసులు నడపడానికి డెల్టా ఎయిర్‌లైన్స్ సానుకూలంగా స్పందించిందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఇరు నగరాల మధ్య విమాన సర్వీసులు లేక పోవడంతో విద్యాభ్యాసం కోసం వచ్చే విద్యార్థులు, ఇతర ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తున్నదన్నారు. దీనిపై కంపెనీ వర్గాలు సానుకూలంగా స్పందించాయి.

ఆయనొక మార్గదర్శి

హైదరాబాద్, జూన్ 8 (నమస్తే తెలంగాణ) : వ్యాపార రంగానికి ఆయనొక మార్గదర్శి. ఏ పనైనా దూరదృష్టితో ప్రణాళికవేస్తే విజయం సాధిస్తామన్న ధీమా ఈనాడు సంస్థల చైర్మన్ రామోజీరావుకు పుట్టుకతోనే వచ్చింది. తాను మొదలు పెట్టే ఏ కార్యక్రమమైనా తాత్కాలికంగా కాకుండా.. దీర్ఘకాలికంగా నిలువాలనే ఉద్దేశంతో అడుగులు వేశారు. కృషి, పట్టుదలతో విజయవంతంగా ముగించాలని భావిస్తుంటారు కాబట్టే ఆయన చేపట్టినదేదైనా బంగారమైంది. శూన్యం నుంచి చరిత్రను లిఖించగలిగిన వ్యక్తిగా ఎదిగారంటే కారణం ఆయన క్రమశిక్షణే. అందుకే ఆయనొక వ్యాపార మార్గదర్శిగా నిలిచారు.

ఢిల్లీలోనే వ్యాపార బీజాలు..

గుడివాడలో ఇంటర్మీడియట్ చదివిన తర్వాత తొలి ఉద్యోగం దేశ రాజధాని ఢిల్లీలో చేశారు. 'అనంత్' అనే మలయాళీ స్థాపించిన ఒక యాడ్ ఏజెన్సీలో ఆర్టిస్ట్‌గా చేరారు. అక్కడ తన డెడికేషన్ చూసి ఆ యజమాని ఉప్పొంగిపోయేవారు. అప్పుడే గొప్ప విజయాలు సాధించవచ్చన్న ఆత్మవిశ్వాసం ఆయనలో పెరిగింది. వచ్చిన అమెరికా అవకాశాన్ని కుటుంబం కోసం వదులుకొని.. 1962 అక్టోబర్‌లో మార్గదర్శి చిట్‌ఫండ్స్‌ను స్థాపించారు. చిట్టీల వ్యాపారమంటే గృహిణుల వ్యవహార మన్న రోజుల్లోనే మార్గదర్శిని ఓ మార్గదర్శకంగా తీర్చిదిద్దారు. వసూళ్లు, చెల్లింపులు కచ్చితంగా ఉండటంతో ఖాతాదారుల్లో విశ్వాసం ఏర్పడింది. సిబ్బంది క్రమశిక్షణ, అంకిత భావం, యాజమాన్య విశ్వసనీయత కారణంగా సంస్థ వేగంగా అభివృద్ధి చెందింది.

ఆతిథ్య రంగంలోనూ... హవా

సాగర తీర సుందర పట్టణం విశాఖలో డాల్ఫిన్ హోటల్‌ను 1980లో ప్రారంభించారు. విశాఖ పెద్ద పర్యాటక నగరంగా అభివృద్ధి చెందుతుందని ముందస్తు అంచనాతో ఆయన.. త్రీస్టార్ హోటల్‌గా దీనిని ప్రారంభించారు. ఇదే క్రమంలో ఆతిథ్య రంగానికి పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని రామోజీ ఫిల్మ్ సిటీలోనే తార, సితార స్టార్ హోటళ్లను నిర్మించారు. సహారా, శాంతినికేతన్‌లు దీని ఆధ్వర్యంలోనే నడుస్తున్నాయి.

ప్రియా పచ్చళ్లకు డిమాండ్..

తెలుగువారి వంటింటి రుచుల్ని ప్రపంచానికి అందించాలనే ఉద్దేశంతో రామోజీరావు 1980లో ప్రియా పచ్చళ్ల వ్యాపారానికి శ్రీకారం చుట్టారు. కృష్ణా జిల్లా పోరంకి గ్రామంలో ఆరు రకాల ఊరగాయలతో ప్రారంభమైన ఈ వ్యాపారం ప్రస్తుతం 205 రకాల ఉత్పత్తులను ప్రపంచవ్యాప్తంగా విక్రయిస్తున్నది.

సాంస్కృతిక వైభవం 'కళాంజలి'

హస్తకళలు, వస్త్ర సోయగాలకు వేదికగా నిలిపేందుకు ఆయన కళాంజలిని 1992లో ప్రారంభించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ఇనుమడింపజేసే చేతివృత్తి కళాకారులను ప్రోత్సహిస్తూ హైదరాబాద్‌లో ప్రారంభమై... విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి వంటి ప్రముఖ నగరాలకు షోరూంలను విస్తరించారు. తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, ఒడిశా, అస్సాం, కేరళ తోపాటు దేశవ్యాప్తంగా విస్తరించారు.

రామోజీ ఫిలిం సిటీకి గుర్తింపు

హైదరాబాద్ వేదికగా 1996లో రామోజీ ఫిలిం సిటీ ఆరంభమైంది. సాధారణ చిన్న సినిమాలతోపాటు, హాలీవుడ్ చిత్రాలు సైతం ఈ ఫిలిం సిటీలో షూటింగ్‌లు జరుపుకుంటున్నాయి. బిగ్గెస్ట్ ఫిలిం ప్రొడక్షన్ సెంటర్‌గా ఈ ఫిలిం సిటీని గిన్నిస్ రికార్డు సైతం వరించింది.



ప్రారంభించిన వ్యాపారాలు

- ప్రకటనల వ్యాపారం కోసం 1965లో కిరణ్ యాడ్స్ పేరుతో ప్రత్యేకంగా సంస్థను ప్రారంభించారు.
- 1967-69 మధ్యకాలంలో ఖమ్మం వేదికగా వసుంధర ఫర్టిలైజర్స్ పేరుతో ఎరువుల వ్యాపారాన్ని నిర్వహించారు. ఆ తర్వాత అన్నదాత పత్రికను ప్రారంభించడంతో ఈ వ్యాపారానికి స్వస్తి పలికారు.
- ప్రస్తుతం 16 భారతీయ భాషల్లో ఈటీవీ చానెళ్లను నిర్వహిస్తున్నారు.